

టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టం రూ10 వేల ప్రకారం అమ్మకాలు జరిగాయి.



కిలో టమాట రూ.26

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.15, సరాసరిన రూ.21 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/23.8°

జిల్లాలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి ఆలయ హుండీ కానుకల లెక్కింపు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 43 రోజులకు గాను లెక్కింపు నిర్వహించగా నగదు రూ.72,48,024 ,బంగారు 24 గ్రాములు, వెండి 807 గ్రాములు, విదేశీ కరెన్సీ యూఎస్ఏ (అమెరికా) డాలర్లు 26 వచ్చినట్లు తెలిపారు. గతంలో కంటే ఈసారి ఆదాయం పెరిగినట్లు ఈఓ తెలిపారు. హుండీల పర్యవేక్షణాధికారి డీ.రమేష్‌బాబు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చలపతి, ఆలయ, బ్యాంక్ సిబ్బంది, వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ నాయకుడి దాడి



టీడీపీ నాయకుడు శివరామ్ చేతిలో గాయపడిన శ్రీరాములు కుటుంబ సభ్యులు

పుట్టపర్తి: ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా గ్రామాల్లో టీడీపీ నేతల ఆగడాలు ఆగడం లేదు. తాజాగా బుక్కపట్నం మండలం శీకాయకుంటపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన రైతులపై దాడికి తెగబడ్డారు. వివరాల్లోకెళితే.. శీకాయకుంటపల్లి నుంచి రామసాగరానికి వెళ్లే రోడ్డుపై వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన రైతు శ్రీరాములు వేరుశనగకాయలను ఎండబెట్టాడు. నువ్వు ఇక్కడ వేరుశనగకాయలను ఎండబెట్టొద్దు.. నేను ఇక్కడ కాయలు ఎండబెట్టాకోవాలి అంటూ శీకాయకుంటపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, డీలర్ శివరామ్ వాదనకు దిగారు. ఇందులో భాగంగానే శివరామ్ కర్రలు, రాళ్లతో శ్రీరాములుతో పాటు అతని భార్య పద్మావతి, కోడలిపై దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీరాములు ఎడమ చేయి విరిగింది. బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే టీడీపీ నాయకుడు శివరామ్ బాధితులకంటే ముందుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వినాయక మండపం వద్ద కొడవలితో వ్యక్తి హల్‌చల్



కొడవలితో హల్‌చల్ చేస్తున్న వ్యక్తి

హిందూపురం అర్బన్: పట్టణంలోని లక్ష్మీపురంలో వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి కొడవలితో హల్‌చల్ చేశాడు. వివరాలు.. లక్ష్మీపురంలో వినాయక మండపం వద్ద పాటలు పెట్టొద్దని తన తల్లికి శబ్దం పడదని శ్రీహరినాయుడు అనే వ్యక్తి నిర్వాహకులకు చెప్పాడు. దీంతో వారు సౌండ్ తగ్గించి పాటలు పెట్టుకున్నారు. అయితే ఇంటికి వెళ్లిన వ్యక్తి మద్యం తాగి వచ్చి కొడవలితో నిర్వాహకులపైకి దూసుకొచ్చాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రాగా ఆయనతో కూడా దురుసుగా ప్రవర్తించాడు. అక్కడున్న వారు శ్రీహరినాయుడిని పట్టుకుని కొడవలి లాక్కున్నారు. తర్వాత ఇంటికి వెళ్లిన అతడు కత్తితో వచ్చి పొడుస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

వైద్యవిద్యపై నారాసురాస్త్రం



పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

ఏదో ఒక రకంగా లబ్ధి పొందడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే సీఎం చంద్రబాబు ప్రైవేట్ మంత్రాన్ని జపిస్తున్నారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలకు మోకాలడ్డి నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేశారు.

- పెనుకొండలో ఆగిపోయిన నూతన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- అంధకారంలోకి విద్యార్థుల భవిష్యత్
- తీరని అన్యాయం చేస్తున్నారంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రభుత్వ తీరుపై నివ్వెరపోతున్న విద్యావేత్తలు, మేధావులు

పెనుకొండ/పుట్టపర్తి అర్బన్: సొంత రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనే పేద విద్యార్థుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండలో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారు. దీన్ని పూర్తి చేసి వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శతవిధాలా ప్రయత్నించారు. ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల నిర్మాణాలను నిలిపి వేస్తూ ఆదేశాలు జారీచేశారు.

ఆగిన నిర్మాణ పనులు

కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు పెనుకొండలో నిరవధికంగా కొనసాగుతున్న మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో జిల్లా ప్రజల ఆశలకు గండిపడినట్లైంది. 2021, మే 31న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పలు మెడికల్ కాలేజీలకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. అందులో పెనుకొండ మెడికల్ కళాశాల ఒకటి. దీని నిర్మాణానికి ఏకంగా రూ. 475 కోట్లు (నాబార్డ్) ద్వారా కేటాయించారు. అదే విధంగా కోట్ల రూపాయల విలువైన షీఫారం స్థలం 50 ఎకరాలు ఇందుకోసం కేటాయించారు.

'మెగా'కు చెక్ పెట్టే యత్నం..

మెగా ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ సంస్థను ప్రభుత్వం మెడికల్ కళాశాల పనుల నుంచి తప్పించడానికే కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేసిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అస్మదీయ కాంట్రాక్ట్ సంస్థకు కూటమి ప్రభుత్వం పనులు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కొందరు అధికారులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పనులు ఊపందుకున్న తరుణంలో ఇలా ఆపేయడంతో భవిష్యత్తులో మళ్లీ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బిల్లులు మంజూరు చేయకపోవడం, నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ అయోమయంలో పడింది. దాదాపు రూ. 20 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది.

వైద్యవిద్య కోసం సుదూర ప్రాంతాలకు..

పెనుకొండలో నిర్మాణంలో ఉన్న కొత్త మెడికల్ కళాశాల పనులను కూటమి ప్రభుత్వం అడ్డుకోవడంతో విద్యార్థుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2022లో జిల్లాలోని పలువురు విద్యార్థులు వైద్య విద్య కోసం ఉక్రెయిన్ వెళ్లారు. అక్కడ అప్పట్లో రష్యా దాడులు చేయడంతో బంకర్లలో తలదాచుకొని ఎలాగోలా స్వదేశానికి వచ్చారు. ఇందులో పుట్టపర్తి మండలం నిడిమామిడికి చెందిన షేక్ దాదాపీర్ అనే విద్యార్థి మెడిసిన్ చివరి సంవత్సరం చదువుతూ స్వదేశానికి వచ్చాడు. ఢిల్లీలో చివరి సంవత్సరం మెడిసిన్ పూర్తి చేశారు. వైద్య విద్యకు సుమారు రూ.65 లక్షలు వెచ్చించాడు. పుట్టపర్తికి చెందిన భవ్య ఇక్కడ వైద్య కళాశాలలో సీట్లు దొరక్క రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసి చైనాలో వైద్య విద్యను అభ్యసిస్తోంది. స్థానికంగా వైద్య కళాశాలల అందుబాటులో ఉండి ఉంటే అంత ఖర్చు అయ్యేది కాదని భవ్య కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



మెడికల్ కళాశాల బోర్డు

బెంగళూరులో కోర్సు చేశా



ఫిజియోథెరపీ చేయాలనేది నా కల. స్థానికంగా కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటకలోని బెంగళూరులో చదివాను. ఇక్కడే కళాశాలలు అందుబాటులో ఉండి ఉంటే తక్కువ ఖర్చుతోనే కోర్సు పూర్తయ్యేది. పేద విద్యార్థులు లక్షలాది రూపాయలు వెచ్చించడం చాలా కష్టం. ప్రభుత్వం విద్యార్థుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలి.

– శివకళ్యాణ్‌రెడ్డి, హిందూపురం

నిర్మాణాలు ఆపేయడం సరికాదు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన బృహత్ కార్యాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణం ఒకటి. వాటి నిర్మాణాలను నిలిపివేస్తే రాష్ట్ర ప్రజల ఆగ్రహాన్ని చంద్రబాబు చవి చూడాల్సి వస్తుంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఆపాలి. ఇక్కడ మెడిసిన్ సీట్లు రాక చాలా మంది విద్యార్థులు మాదిరే నా కుమార్తెను వేరే ప్రాంతంలో చదివిస్తున్నా. ఎన్నో ఇబ్బందులు పడి అంత దూరం వెళ్లాల్సి వచ్చింది. స్థానికంగా కళాశాల ఉంటే ఇక్కడే మెడిసిన్ పూర్తి చేసేది.

– కవిత, పుట్టపర్తి

ప్రైవేటుపరం చేయడం అనైతికం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చుతో పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తారు. వాటిని ప్రైవేటుపరం చేస్తే నిరుపేదలు వైద్య విద్యను అభ్యసించాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. జగన్ ప్రారంభించిన అన్ని మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాలి. వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలి.

– లింగా రామ్మోహన్, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు, బుక్కపట్నం

త్వరలోనే సమీక్ష చేస్తాం



మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు నిధుల విడుదల ఆలస్యం అవుతోంది. అందుకే పనులు సైతం నెమ్మదిగా సాగుతున్నాయి. త్వరలోనే దీనిపై అధికారులతో సమీక్ష నిర్వహించి విషయాన్ని పూర్తిగా కనుక్కుంటాను. ప్రస్తుతం వరద బాధితుల సహాయ పనుల్లో వున్నా.

– సవిత, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖామంత్రి

పనులు ఆగిపోయాయి

పెనుకొండ పట్టణ పరిధిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులు నిలుపుదల చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. సకాలంలో నాబార్డ్ నుంచి నిధులు విడుదల కాలేదన్నది మా దృష్టికి వచ్చిన సమాచారం . దీంతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నిలుపుదల చేస్తున్నాము. ఇప్పటి వరకూ 10 నుంచి 15 శాతం లోపలే పనులు జరిగాయి. మెగా ఇంజినీరింగ్ సంస్థకు రూ. 20 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మేర పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలీదు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ముందుకు వెళ్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ, పెనుకొండ

జగనన్నకు మంచి పేరు వస్తుందనే..



మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌కు మంచి పేరు వస్తుందనే కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. దీని వెనుక జిల్లా మంత్రి సవిత హస్తం కూడా ఉంది. వెనుకబడిన ప్రాంతమైన పెనుకొండలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.475 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించి పనులు మొదలు పెడితే జిల్లా విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేలా పనులు ఆపేయడం దుర్మార్గం. ప్రజలకు అన్యాయం జరిగితే ప్రజా పోరాటానికి సిద్ధమవుతాం.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

రాప్తాడులో తుపాకుల సంస్కృతి మొదలైంది

- అరాచకాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్
- పార్టీ కార్యకర్తను పరామర్శించడానికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు



శాంతిభద్రతలను కాపాడాలంటూ డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ఉన్న తుపాకులు, బాంబుల సంస్కృతి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ మొదలైందని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం కుంటిమద్దిలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడిని గన్, కత్తితో హత్యాయత్నానికి పాల్పడడం, నసనకోటలో ఓ నాయకుడి ఇంటిపై రాళ్లదాడి, కొన్ని గ్రామాల్లో యువతను బహిష్కరించడం తదితర ఘటనలు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయని వాపోయారు. నియోజకవర్గంలో పూర్తిగా అదుపుతప్పిన శాంతిభద్రతలపై ధర్మవరం డీఎస్పీ, రామగిరి సీఐలను కలిసి విన్నవించి, అక్కడి నుంచి బాధితలను పరామర్శించేందుకు గురువారం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అనంతపురం నుంచి బయలుదేరారు. సమాచారం అందుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రెడ్డప్ప, శ్రీధర్, నాగేంద్రప్రసాద్, ఎస్ఐ, సిబ్బంది రాప్తాడు మండలం మరూరు టోల్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. వెళ్లడానికి వీలులేదంటూ నిలిపేశారు. పోలీసులతో గోరంట్ల మాధవ్ వాగ్వాదం చేసినా లాభం లేకపోయింది. అనుమతులు లేవని రామగిరి మండలానికి వెళ్లడానికి వీలులేదంటూ కరాఖండిగా చెప్పేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముద్ర వేసి అర్హులైన వారికి పింఛన్లు నిలిపేయడం దుర్మార్గం అన్నారు. పారదర్శకంగా పని చేయాల్సిన అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. చివరకు సడ్సిబీ విత్తనాల సరఫరాలోనూ రాజకీయం చేస్తున్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారన్నారు. చాలా గ్రామాల్లో యువతను బహిష్కరించడంతో బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి తల దాచుకున్నారని వాపోయారు. తమ కార్యకర్తలను కలిసేందుకు వెళ్తున్న తమను పోలీసులతో అడ్డుకోవడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో కచ్చితంగా బాధిత కుటుంబాలను పరామర్శిస్తామన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పార్టీ మారితే నిధులిస్తామంటారా?

- మంత్రి సవిత తీరు హేయం
- సర్పంచులకు నిధుల మంజూరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

ప్రశాంతి నిలయం: పెనుకొండలో మంత్రి సవిత తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేయాలనుకుంటే సహించే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. కేంద్రం పంచాయతీల అభివృద్ధి, నిర్వహణకు మంజూరు చేసిన నిధులను పెనుకొండ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు అధికారంలో ఉన్న పంచాయతీలకు మంజూరు చేయకుండా అధికారులపై ఒత్తిడి చేయడం హేయమన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ సర్పంచులతో కలిసి ఉషశ్రీచరణ్ కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వాలు అందించే నిధులను ఖర్చు పెట్టే అధికారం ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లకు ఉంటుందన్నారు. పార్టీలు ఏవైనా పంచాయతీలన్నింటికీ నిధులను మంజూరు చేయాల్సిందేనన్నారు. మంత్రి సవిత చట్టాలను తుంగలో తొక్కి టీడీపీలో చేరితేనే నిధులు మంజూరు చేస్తామని బెదిరిస్తూ టీడీపీ మార్క్ రాజకీయాలకు తెరలేపారన్నారు. ఆమె తన వైఖరి మార్చుకోకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అధికారులు సైతం రాజకీయ నాయకుల మాటలు విని చట్టాలను పక్కన బెడితే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నా నిధుల్లేక అల్లాడిపోతుంటే మంత్రి సవిత ప్రజల ఆరోగ్యం కంటే రాజకీయాలే ముఖ్యం అన్నట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అలాగే జిల్లాలో టీడీపీ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ఇలాగే కొనసాగితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, జిల్లా వ్యవసాయసాయ సలహా మండలి మాజీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి రూరల్ కన్వీనర్ నరసారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, పార్టీ నాయకులు గంపల వెంకటరమణారెడ్డి, రఘునాథరెడ్డి, శివారెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, సుధాకర్‌రెడ్డి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

- డిసెంబర్ 4,5,6 తేదీల్లో పోలింగ్

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు కోసం డిసెంబర్ 4,5,6వ తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు డీపీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. డివిజన్ వ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ ఓటింగ్ ద్వారా నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ నెల 18న ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 25లోపు నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. స్క్రూటినీ అనంతరం నవంబర్ 14న పోటీలో ఉన్న వారి తుది జాబితా ప్రకటిస్తారు. డిసెంబర్ 4 నుంచి మూడు రోజుపాటు జరిగే ఎన్నికల్లో మొదటి రెండు రోజులు ఓపెన్ లైన్‌లో పని చేసేవారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. రన్నింగ్ స్టాఫ్‌కు మాత్రం ఈ రెండు రోజులతోపాటు 6వ తేదీ కూడా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 12న ఉంటుంది. ఎన్నికల నిర్వహణకు ఇన్‌చార్జ్ ఆఫీసర్‌గా సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, కో ఆర్డినేషన్ ఆఫీసర్‌గా రంజిత్‌కుమార్, ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌గా జీఆర్ జగదీష్‌కుమార్‌ను ఏర్పాటు చేశారు.

జూడో పోటీల్లో మెరిసిన చిగిచెర్ల విద్యార్థినులు



పతకాలతో నందిని, లాస్యరెడ్డి

ధర్మవరం రూరల్: చెన్నైలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ నేషనల్ సబ్ జూనియర్ జూడో లీగ్ పోటీల్లో చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సత్తాచాటారు. 9వ తరగతి చదువుతున్న నందిని మైనస్ 32 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. అలాగే 9వ తరగతి చదువుతున్న లాస్యరెడ్డి మైనస్ 44 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. గత ఏడాది జమ్మూలో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ పోటీల్లోనూ నందిని సిల్వర్ మెడల్ సాధించిందని పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

పరుగుల వరద



మ్యాచును వీక్షిస్తున్న అభిమానులు



బ్యాటింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్



ఇండియా-బీ జట్టుతో తలపడుతున్న ఇండియా-సీ జట్టు

- దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో బ్యాటర్ల వీరవిహారం
- సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్

అనంతపురం: దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచుల్లో పరుగుల వరద పారింది. బ్యాటర్లు వీర విహారం చేశారు. గురువారం అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో నాలుగు జట్లు తలపడ్డాయి. ఇండియా-బీతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లందరూ సమష్టిగా రాణించడంతో ఇండియా-సీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయి మళ్లీ జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న ఇషాన్ కిషన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 111 (126 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో అదరగొట్టాడు. బాబా ఇంద్రజిత్ 78 (136 బంతుల్లో 9 ఫోర్లు), సాయి సుదర్శన్ 31(37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రజిత్ పటిదార్ 40(75 బంతుల్లో 8 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం రుతురాజ్ గైక్వాడ్ 46 (50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మానవ్ సుతార్ (8) క్రీజులో ఉన్నారు. ఇండియా -బీ బౌలర్లలో ముకేష్ కుమార్ 3, నవదీప్ సైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు.

ఆదుకున్న ములాని, తనుష్..

మరో గ్రౌండ్‌లో ఇండియా-డీతో జరుగుతున్న మ్యాచులో ఇండియా-ఏ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. 93 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన జట్టును ఏడో స్థానంలో వచ్చిన శామ్స్ ములాని 88 నాటౌట్ (158 బంతుల్లో 7 ఫోర్లు) ఆదుకున్నాడు. ఎనిమిదో స్థానంలో వచ్చిన తనుష్ కోటియన్ 53 (80 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి జట్టుకు గౌరవ ప్రదమైన స్కోరు అందించాడు. రియాన్ పరాగ్ (37) ఎక్కువ సేపు క్రీజులో ఉండలేదు. ఓపెనర్లు ప్రథమ్ సింగ్ (7), మయాంక్ అగర్వాల్ (7), తిలక్‌వర్మ (10), శాశ్వత్ రావత్ (15) నిరాశపరిచారు. కుమార కుశాగ్ర 28 పరుగులు చేశారు. ములానితో పాటు ఖలీల్ అహమ్మద్ (15) క్రీజులో ఉన్నారు. ఇండియా-డీ బౌలర్లలో హర్షిత్ రాణా, విద్వత్ కావేరప్ప, అర్షదీప్ సింగ్ రెండేసి వికెట్లు పడగొట్టగా, శరన్ష్ జైన్, సౌరభ్‌కుమార్ చెరో వికెట్ తీశారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు గంగాద్రి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు రెవెన్యూ కార్యాలయ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాదస్పద స్థితిలో మృతి చెందాడు. సీఐ ఇంద్రాణి తెలిపిన వివరాలు.. కొత్తచెరువు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన గంగాద్రి(40) తన భార్య రెండేళ్ల క్రితం వదిలివేయడంతో కొత్తచెరువులో తన చెల్లెలు పుష్ప వద్ద ఉంటూ బెల్దారీ పనికెళ్లేవాడు. రెండు రోజుల నుంచి గంగాద్రి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం గంగాద్రి కొత్తచెరువు రెవెన్యూ కార్యాలయం సమీపంలో విగతజీవిగా కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. రెండు రోజుల క్రితమే అతడు మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా హత్యచేసి పడేశారా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంలో బేల్దారి మృతి


మృతి చెందిన కుల్లాయప్ప

ధర్మవరం రూరల్: రేగాటిపల్లిలో గురువారం విద్యుత్ విద్యుదాఘాతంలో ఓ బేల్దారి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాల మేరకు.. ధర్మవరం యాధవ వీధికి చెందిన కుల్లాయప్ప(27), గొట్లూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి రేగాటిపల్లిలో షెడ్ నిర్మాణ పనులు చేస్తున్నారు. అక్కడ ఇనుప రేకులపైన సిమెంట్ దిమ్మె కట్టడం కోసం రేకులపైకి ఎక్కారు. ప్రమాదపు శాత్తు పై భాగంలో ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కుల్లాయప్పకు తీవ్రగాయాలయ్యాయి. నారాయణస్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుల్లాయప్ప మృతి చెందాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అనంతపురం మెడికల్: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాల నియంత్రణపై ఇటీవల విడుదల చేసిన జీఓ(31, 39)లను వివరించారు. బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లదే కీలకపాత్ర అని అన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్, సీడీపీఓలు ధనలక్ష్మి, ఉమాశంకరమ్మ, చైల్డ్‌లైన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వైద్యం.. పేదలకు దూరం!

- ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన జగన్ సర్కార్
- 'ఆరోగ్య సురక్ష'తో పేదలు చెంతకు కార్పొరేట్ వైద్యం
- కూటమి ప్రభుత్వంలో కొనసాగని కార్యక్రమం
- వైద్యం కోసం పేదలకు తప్పని వ్యయప్రయాసలు


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు(ఫైల్)

ప్రశాంతి నిలయం: సర్కారు వైద్యం పేదలకు దూరమైంది. ప్రభుత్వం గ్రామాల్లో ఎక్కడా వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. దీంతో వైద్యం కోసం పేదలకు వ్యయప్రయాలు తప్పడం లేదు. గత ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు డాక్టర్లతో పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల వైద్యం విషయంలో శ్రద్ధ చూపడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రజారోగ్య పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

ఆరోగ్య సురక్ష ఇలా..

గతంలో జగన్ సర్కార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాలు, పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటి సర్వే చేపట్టారు. తొలివిడతలో గతేడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 25 వరకు 457 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో బీపీ, షుగర్, రక్తం, మూత్ర, ఈసీజీ వంటి 14 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి 170 రకాల మందులను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో 102 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 80 మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు 1,45,683 మందికి వైద్య సేవలు అందించారు. కంటి చూపు సమస్యతో ఇబ్బందులు పడుతున్న 16,840 మందికి కంటి అద్దాలను అందించారు. క్యాటరాక్ట్ సమస్య ఉన్న 3,043 మందికి ఆపరేషన్లు చేశారు. రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ ఏడాది జనవరి 2 నుంచి ప్రారంభమై జూన్ వరకు కొనసాగాయి. మొత్తం 499 వైద్య శిబిరాలు నిర్వహించగా 39 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 80 మంది మెడికల్ ఆఫీసర్లు 1,78,385 మందికి వైద్య సేవలు అందించారు.

నిలిచిపోయిన 'సురక్ష శిబిరాలు'

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెడ్యూల్ మేరకు జనవరి 2న ప్రారంభమైన రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎన్నికల కోడ్ సమయంలో కూడా నిరాటంకంగా కొనసాగాయి.ఎన్నికల అనంతరం కూడా అధికారులు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు కొనసాగించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరోగ్య సురక్ష ఊసే ఎత్తలేదు. ప్రస్తుత ప్రభుత్వానికి నిర్వహించాలన్న ఆలోచన కూడా లేకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇప్పటి వరకు తమ వద్దకే స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యం అందించే పరిస్థిని చూసిన ప్రజలు ఇప్పుడు రోగం వచ్చిందంటే పట్టణాలకు వెళ్లి వైద్యం కొనాల్సిన పరిస్థితి రావడంతో ఆందోళన చెందుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని గ్రామీణ ప్రాంత ప్రజలు తమ క ష్టార్జితాన్ని అంతా వైద్యానికే ధారపోయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

పేదలకు ఇక్కట్లు



గతంలో పెద్దపెద్ద డాక్టర్లు గ్రామాలకే వచ్చి పేదలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చేవారు. మాలాంటి పేదలకు వ్యయ ప్రయాసలు తప్పేవి. ఇప్పుడు వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు టౌన్‌కు వెళ్లి డాక్టర్ దగ్గర చూపించుకోవాలంటే ఖర్చు తడిసిమోపెడవుతోంది. వైద్యం కోసం పేదలకు ఇక్కట్లు తప్పడం లేదు.

–సురేంద్రనాయక్,గచ్చు తండా,కదిరి మండలం

ఆరోగ్యంపై భరోసా ఉండేది



గతం మా ఊరికే వచ్చి వైద్యులు పరీక్షలు నిర్వహించి నెలకు పరిసడా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నేను షుగర్ వ్యాధితో బాధపడుతున్నా. మందులు కావాలంటే బయట కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యాన్ని చేరువ చేయాలి.

–అదిలక్ష్మి, గంగిరెడ్డిపల్లి, పుట్టపర్తి రూరల్

వైద్యశిబిరాలు కొనసాగించాలి



గతంలో స్పెషలిస్ట్ వైద్యులు మా ప్రాంతానికే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులను అందించేవారు. అప్పుడు ఆరోగ్యం పట్ల భరోసా ఉండేది. ఇప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించకపోవడంతో ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆలోచించి వైద్య శిబిరాలు కొనసాగించాలి.

–రామలక్ష్మి, విద్యానగర్, హిందూపురం

నేడు 'పురం'లో గణేష్ నిమజ్జనం

- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ రత్న


గుడ్డం కోనేరు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వి.రత్న

హిందూపురం/హిందూపురంటౌన్/హిందూపురం అర్బన్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం జరగనుంది. పట్టణ పరిధిలో దాదాపు 200కి పైగా వినాయక విగ్రహాలను కొలువుదీర్చారు. శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 1200 మంది పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి శోభాయాత్ర ప్రారంభంకానుంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో యాత్ర సాగుతుంది. శనివారం తెల్లవారుజాము వరకు నిమజ్జనాలు కొనసాగనున్నాయి.

కోనేరు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

గుడ్డం రంగనాథస్వామి కోనేరు వద్ద ప్రత్యేక చర్యలను అధికారులు చేపట్టారు. నిమజ్జనాన్ని ప్రజలు వీక్షించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే నిమజ్జనాన్ని మున్సిపల్ సిబ్బంది, గజఈతగాళ్లు, తెప్పలను ఏర్పాటు చేశారు. క్రేన్ల ద్వారా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. కోనేరు చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 9440164461, 9676090559 ను అందుబాటులో ఉంచారు.

ఎస్పీ పర్యటన

హిందూపురంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో గురువారం రాత్రి ఎస్పీ వి.రత్న పట్టణంలో పర్యటించారు. ఇందులో భాగంగానే ఊరేగింపుగా గణనాథులను తరలించే రోడ్లు, నిమజ్జనం చేసే గుడ్డం ప్రాంతాన్ని పరిశీలించారు. మసీదు ప్రాంతాల్లో పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు అధికారులకు వివరించారు. ట్రాఫిక్ తలెత్తకుండా చూడాలన్నారు. ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు పట్టణ ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు. అదనపు ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ కె.వి మహేష్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

గృహ నిర్మాణంలో లక్ష్యం సాధించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్


గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి వంద రోజుల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణతో కలసి ఈఈలు, డీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 72,353 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు 22,756 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. డీఈలు శంకర్‌లాల్, శ్రీనివాస్, శివకుమార్‌నాయక్, రమణారెడ్డి, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'ను విజయవంతం చేయండి

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులతో కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. డీపీఓ విజయకుమార్, డ్వామా పీడీ విజయప్రసాద్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, సీపీఓ విజయకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల పనిదినాలను కల్పించాలి

జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి హామీ కింద 100 రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ జిల్లాలో 79 లక్షల పని దినాలను నిర్దేశించగా ఇప్పటి వరకు 57.19 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. కూలీలను ఎక్కువ సంఖ్యలో పనులకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ ద్వారా మంజూరైన పనులను అక్టోబర్ 2 నుంచి మొదలు పెట్టాలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వామా పీడీ విజయప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ మురళీ మోహన్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని ఉసురు తీసుకున్నాడు..


ఎరికల సునీల్ (ఫైల్)

రాప్తాడురూరల్: ఉద్యోగం రాలేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఉసురు తీసుకున్నాడు.ఈ విషాద ఘటన అనంతపురం రూరల్ మండలం ఎన్ఆర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..ఎన్ఆర్ కాలనీకి చెందిన లేట్ వెంకటేశులు, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఈశ్వరమ్మ కలెక్టరేట్‌లో అటెండెర్‌గా పని చేస్తోంది. పెద్దకుమారుడు అనిల్ వస్త్ర దుకాణం పెట్టుకున్నాడు. చిన్న కుమారుడు ఎరికిల సునీల్(22) ఎంబీఏ పూర్తి చేశాడు. ఏడాదిగా ప్రయత్నం చేస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడిపత్రి అర్బన్: స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని డివైడర్ వద్ద గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. మృతుడు యాచక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


కార్తీక్‌నాయక్ (ఫైల్)

వజ్రకరూరు: రాగులపాడు గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..పామిడి మండలం పాళ్యంతండాకు చెందిన కార్తీక్‌నాయక్(22) ఆటోలో గురువారం సాయంత్రం స్వగ్రామం నుంచి ఉరవకొండకు బయలుదేరాడు. రాగులపాడు గ్రామం సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువ వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో అతడు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ప్రాణం తీసిన అతివేగం


మృతి చెందిన బాలాజీ

కంబదూరు: అతివేగం ఓ యువకుడి ప్రాణం తీసింది. వివరాలు..కదిరిదేవరపల్లికి చెందిన బాలాజీ(30) తిమ్మాపురం వద్ద ఉన్న సోలార్‌లో అపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం కంబదూరులో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అండేపల్లి–దేవరమాన్ల సమీపంలో అతివేగానికి బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

లైన్‌మన్ బలవన్మరణం


రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: ఆరోగ్య సమస్యలతో విద్యుత్ లైన్‌మన్ ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం కోనాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు(58) కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. కళ్యాణదుర్గంలోని పార్వతినగర్‌లో నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

అనంతపురం సిటీ: స్థానిక హెచ్ఎల్‌సీ కెనాల్ సమీపంలోని గురువారం ఉదయం గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పంజాబీ డ్రెస్‌తో ఉన్న ఆమె గ్రీన్ కలర్ లెగ్గిన్, డార్క్ గ్రే కలర్ ఓణీ, బ్లాక్ కలర్ చెప్పులు ధరించింది. జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించారు.

అప్పులబాధతో రైతు..

గార్లదిన్నె: మర్తాడుకు చెందిన ఓ రైతు అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓబిలేసు(35) తనకున్న 3 ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. పంట పెట్టుబడి కోసం ఇతరుల వద్ద రూ.6 లక్షల దాకా అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలోనని మధనపడేవాడు. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సయమంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య ధరణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య


పావని(ఫైల్)

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడులో ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజులరెడ్డి, రమాదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె పావని(19) కొయంబత్తూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వినాయక చవితి పండుగ ఉండటంతో ఇంటికి వచ్చింది. అయితే చదువుకోవడం ఇష్టం లేని ఆమె గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్టోర్ రూంలోకి వెళ్లి ఉరి వేసుకుంది. ఉదయం గమనించిన తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి దారుణహత్య


నూరుల్లా (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గురువారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు. పట్టణంలోని రామచంద్రలాడ్జి వెనుక వైపు వీధిలో ఉంటున్న నూరుల్లా(30) అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడిగా పని చేసేవాడు. అయితే పట్టణంలోని కమ్మవారివీధికి చెందిన లారీ డ్రైవర్ నజీర్ భార్యతో నూరుల్లా సన్నిహితంగా ఉండేవాడు. గురువారం రాత్రి నూరుల్లా నజీర్ ఇంటి పరిసరాల్లో సంచరిస్తుండగా అనుమానం వచ్చిన నజీర్ నూరుల్లాను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో నజీర్ నూరుల్లాను బండరాయితో మోది చంపి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, అర్బన్, రూరల్ అప్‌గ్రేడ్ సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సీతారాంపల్లిలో పట్టపగలే ఇంట్లో చోరీ

ధర్మవరం రూరల్: సీతారాంపల్లిలో గురువారం పట్టపగలే ఓ ఇంటిలో చోరి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పి. వసంతరెడ్డి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాగా తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. బీరువా పగులగొట్టి బీరువాలో ఉన్న 5 తులాల బంగారు, రూ.80 వేలు నగదు చోరికి గురైనట్లు గుర్తించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కనగానపల్లిలో...

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలోని మిద్దెల దగ్గర పట్ట పగలే రెండిళ్లలో చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. దాదులూరు మిద్దెల దగ్గర అన్నదమ్ములైన రమేష్, శ్రీనివాసులు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనుల కోసం పొలం దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో రెండిళ్లలోకి దొంగలు చొరబడి బీరువాలు, అలమారాల్లో దాచి ఉంచిన సుమారు రూ.65 వేల నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. అయితే చోరీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు శ్రీధర్

హిందూపురం అర్బన్: పట్టణంలోని మోడల్ కాలనీలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాలు.. మోడల్ కాలనీలో ఉంటున్న ఆదినారాయణప్ప కుమారుడు శ్రీధర్(28) కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడికి 9 నెలల క్రితం హిందూపురం మండలం చౌళూరుకు చెందిన నిహారికతో వివాహమైంది. భార్య ఉన్నత చదువులు చదవాలని కోరడంతో ఆమెను పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఎంబీఏ చదివిస్తున్నాడు. తాను ఆశించిన ఉద్యోగం దొరకలేదని తరచూ మదనపడేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెలరేగిపోతున్న మట్టిమాఫియా


పరిగి చెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పరిగి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. టీడీపీ నాయకులు మంత్రి సవిత పేరు చెప్పుకుంటూ నిత్యం వందలాంది ట్రాక్టర్లతో పాటూ టిప్పర్లను పెట్టి రాత్రి పగలూ తేడాలేకుండా మట్టిని తరలిస్తున్నారు. తాజాగా గురువారం పరిగి చెరువులో టీడీపీకి చెందిన నాయకులు జేసీబీ యంత్రాలతో మట్టిని అక్రమంగా తరలించారు. జైభీం పార్టీ నేత ఊటుకూరు నాగరాజు మాట్లాడుతూ తాను పరిగి చెరువులో జరుగుతున్న మట్టి రవాణాపై ప్రశ్నిస్తే అటు ఇరిగేషన్ శాఖ, ఇటు రెవెన్యూ శాఖ అధికారుల నుంచి స్పందన కరువైందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మట్టి తరలింపును అరికట్టాలని కోరారు.

జీఓ 85 రద్దు చేయాలి


ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తిప్పయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు సర్వీస్ కోటాలో తీవ్రంగా నష్టం కలిగించే జీఓ 85ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు కోరారు. ఈమేరకు గురువారం వారు ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ తిప్పయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల ప్రయోజనాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం జీఓ 85 విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యను గుర్తించి జీవోను రద్దు చేయాలని కోరారు. ఆదివారం విజయవాడలో ఏపీ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీకి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు తరలిరావాలని కోరారు. డాక్టర్ రామకృష్ణతో పాలు జిల్లాలోని పలు పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి పొలంలో పట్టుబడిన రేషన్ బియ్యం

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్‌కు చెందిన టీడీపీ నేత మాకాని వెంకటేశులు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన 180 ప్యాకెట్లు (7టన్నులు) రేషన్ బియ్యం గురువారం రాత్రి పోలీసులకు పట్టుబడింది. అనంతపురం ఎస్ఓజీ (స్పెషల్‌బ్రాంచ్) పోలీసులకు అందిన సమాచారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పొలంలో దాచిన బియ్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించడతోపాటు వెంకటేశులుపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.